

ఇంగ్లీషు పరీక్షకు 385 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లాలో శుక్రవారం జరిగిన పదో తరగతి ఇంగ్లీషు పరీక్షకు 385 మంది గైర్హాజరయ్యారని జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 23,804 మంది విద్యార్థులకు 23,419 మంది హాజరయ్యారని తెలిపారు. ఎస్ఎస్‌సి అపోస్ పరీక్షలకు 2,498 మందికి 2,267 మంది విద్యార్థులు హాజయ్యారని తెలిపారు. ఈ పరీక్షలు జిల్లాలో 29 కేంద్రాల్లో జరిగాయన్నారు. జిల్లా స్థాయి పరిశీలనాదికారి 7 పరీక్షా కేంద్రాలను, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు 7 పరీక్ష కేంద్రాలను, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి 5 పరీక్షా కేంద్రాలను, తనిఖీ అధికార్లు 70 పరీక్షా కేంద్రాలను మొత్తం 89 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారన్నారు. ఇంగ్లీష్ పరీక్ష అన్ని 134 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగిందన్నారు

ఆయాల వేతన వెతలు

నెలకు రూ.4వేల మాత్రమే వేతనం
ఆర్థిక ఇబ్బందులతో సతమతం
సమస్యలు పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో మున్సిపల్స్ స్కూల్స్ ఆయాలు వేతన వెతలు ఎదుర్కొంటున్నారు. పార్ట్‌టైం కంటింజెంట్ వర్కర్స్ అంటూ ప్రభుత్వం వారికి రూ.4వేల మాత్రం ఇచ్చి వెట్టి చాకిరీ చేయిస్తోంది. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ పేరుతో పారిశుధ్య నిర్వహణపై ప్రచార ఆర్భాటాలు నిర్వహిస్తున్న విషయం విధితమే. రాష్ట్ర ప్రభుత్వమూ తామేమి తీసికట్టు కాదంటూ సభా వేదికలపై పారిశుధ్య కార్మికులకు సత్కారాలు చేస్తున్నాయి. కాని వారి సమస్యలను మాత్రం పరిష్కరించట్లేదు. పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణలో కీలక భూమిక పోషిస్తున్న ఆయాల (కంటింజెంట్ కార్మికులు)ల సమస్యలపై నిర్లక్ష్యం వెంటాడబుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల కార్మికులు పోరాట బాట పట్టారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి తమ ఆవేదనను వ్యక్తం చేశారు.



పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర

మున్సిపల్ స్కూల్స్‌లలో పనిచేస్తున్న ఆయాలు అత్యధిక మంది దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగుతలకు చెందిన వారున్నారు. దశాబ్దాల కాలంగా పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో చిన్నపిల్లల అవసరాలను తీర్చుతూ పర్యవేక్షిస్తున్నారు. తరగతి గదులను శుభ్రం చేయటం, మొక్కల సంరక్షణ తదితర బాధ్యతలు నిర్వరిస్తున్నారు. 1985లో కేవలం నెలకు రూ.5 చొప్పున విధుల్లోకి చేరి ఇప్పటికీ పనిచేస్తున్నావారున్నారు. అటువంటి వారిని ప్రభుత్వం విస్మరించటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

వేతనాల చెల్లింపులకు వేధింపులే...

కార్మికుల వేతనాల చెల్లింపులకు వేధింపులు తప్పటంలేదు. రాజమహేంద్రవరంలో 64 మంది, కొవ్వూరులో 5 మంది, నిడదవోలు మున్సిపాల్ స్కూల్స్‌లలో మరో 5 మంది మొత్తం 74మంది ఆయాలు పనిచేస్తున్నారు.అత్యధిక మంది నాలుగు దశాబ్ధాలుగా విధులు నిర్వహిస్తున్న వారున్నారు. ప్రభుత్వం నెలకు రూ.4వేలు మాత్రమే వేతనాలు చెల్లిస్తోంది. అయినప్పటికీ స్కూల్స్‌పైనే ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. ఆన్‌లైన్ చెల్లింపుల విధానం ఇప్పటికీ అమల్లోకి రాలేదు. స్కూల్ హెడ్ మాస్టర్ నుంచి వేతన రశీదు పొందిన కార్మికులు నగదు కోసం కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయక తప్పటంలేదు. కార్పొరేషన్ సిబ్బంది మొత్తం తమ పరిధిలోని ఆయాల అందరి రశీదులు వచ్చిన తర్వాతే బిల్లులు పెట్టడుతున్నారు. దీంతో ప్రతి నెలా 25వ తేదీ వరకూ ఎదురు చూపులు తప్పటంలేదు.

ఫుల్‌టైం వర్కర్స్‌గా గుర్తించాలి

జిల్లాలో 74 మంది ఆయాలు ఉన్నారు. పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ బాధ్యతలు చేపడుతున్నారు. అయితే ప్రతి నెలా మాకు వేతన వెతలు తప్పటంలేదు. కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఫుల్‌టైం కంటింజెంట్ వర్కర్స్‌గా గుర్తించాలి. ఫలితంగా మాకు నెలకు కనీసం రూ.8వేలు చెల్లించే అవకాశం ఉంది. ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

- వై.ఝాన్సీ, జిల్లా కార్యదర్శి
మున్సిపల్ స్కూల్ ఆయాల సంఘం

పిఎఫ్, ఇఎస్ఐ కల్పించాలి

జిల్లాలోని మున్సిపల్స్ స్కూల్స్‌లో ఆయాలు 30 సంవత్సరాలుగా సేవలందిస్తున్నారు. వారందరినీ ఫుల్‌టైం పని చేయించుకుంటూ పార్ట్‌టైం కంటింజెంట్ పేరుతో నామమాత్రపు వేతనాలు చెల్లిస్తున్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయటంతో పాటు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి. అదే విధంగా యూనిఫాంలు, సబ్బు, తదితర ఆరోగ్య పరిరక్షణ ఉపకరణాలు అందజేయాలి.

- బి.పవన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

బ్యాంకుల తీరుపై కలెక్టర్ అసంతృప్తి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించలేనప్పుడు మూడు నెలలకు ఒకసారి డిసిసి సమావేశాల నిర్వహణ వల్ల ప్రయోజనం ఏమిటి? అని కలెక్టర్ బ్యాంకుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో 2024-25 సంవత్సర నాల్గోవ త్రైమాసిక జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వెనుక బడిన తరగతుల, ఇతర వెనుకబడిన తరగతుల కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఎస్ కార్పొరేషన్, మైనారిటీ కార్పొరేషన్ పరిధిలో ఈ ఏడాదికి ఇచ్చిన యూనిట్స్ గ్రౌండింగ్ దరఖాస్తుల స్వీకరణ మార్చి 22 నాటికి పూర్తి చేసి, ఏప్రిల్ 7ర స్క్రూటీనీ, జ్యోతిరావు పూలే జయంతి 11 నాటికి గ్రౌండింగ్ పూర్తి చేయాలన్నారు.

బ్యాంకులకు వచ్చిన దరఖాస్తులను వెంటనే స్క్రూటీనీ చేసి యూనిట్స్ స్థాపన దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు రుణాలు విషయంలో కచ్చితమైన తీరు కలిగి ఉందని, ఆయా వర్గాలకు రుణాల మంజూరులో బ్యాంకర్లు స్పందించాలన్నారు. బ్యాంకుల పనితీరుపై రాష్ట్రా స్థాయి బ్యాంకర్ల కమిటీకి నివేదిక ఇస్తామన్నారు. బ్యాంకు ఆఫ్ ఇండియా తరపున హాజరైన సీనియర్ అధికారి లక్ష్మణరావు వివరాలు తెలియదు అని చెప్పడం, ఇండియన్ బ్యాంకు ప్రతినిధి సంబంధం లేకుండా వివరణ ఇవ్వడం వారి పనితీరుకు నిదర్శనం అన్నారు. బ్యాంకర్ల పనితీరు, ఆర్‌బిఐ ప్రతినిధి గూగుల్ మీట్ ద్వారా హజరు కావడం మినిట్స్‌లో నమోదు చేయాలని ఎల్‌డిఎంను ఆదేశించారు.

బిసి కార్పొరేషన్ ఎ,బి,సి,డి గ్రూపులకి 1,229 యూనిట్స్, జనరిక్ మెడికల్ షాప్స్ 24 యూనిట్స్, బాంబూ బాస్కెట్, పొట్టేరీ 121 యూనిట్స్, కాపు కార్పొరేషన్ ద్వారా 749 యూనిట్స్, కాపు కార్పొరేషన్ ద్వారా ఎంఎస్ఎంఇకి చెందిన 8 యూనిట్స్, ఈడబ్ల్యూసి కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు 173 యూనిట్స్, జనరిక్ మెడిసిన్స్ 30 యూనిట్స్, షెడ్యూల్ కాస్ట్ సహకార సొసైటీ ద్వారా 699 యూనిట్స్, మైనారిటీ కార్పొరేషన్ 12 యూనిట్స్ ఏర్పాటు చేయాలన్నారు. బ్యాంకులు చొరవ తీసుకుని, సరళీకత విధానంలో యూనిట్స్ ఏర్పాటుకు సహకరించాలన్నారు. డిసెంబర్ 2024 నాటికి పూర్తి అయిన వార్షిక ప్రణాళిక ప్రకారం 3వ క్వార్టర్ నాటికి కౌలు రైతులకు సిసిఆర్‌సి 15,469 మందికి రుణాలు ఇచ్చారన్నారు.ఈ ఏడాది రూ.320 కోట్ల రుణాలకు, రూ.48 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. పశు కిసాన్ యూనిట్స్ గ్రౌండింగ్ పై పశుసంవర్ధక ఫీల్డ్ స్టాఫ్ క్షేత్ర స్థాయిలో బ్యాంకులకు వెళ్లి నివేదిక అందించాలన్నారు. పశు కిసాన్ కార్డుల కోసం 12,871 దరఖాస్తులకు 6,695 స్వీకరించగా 1,116 మందికి మాత్రమే బ్యాంకుల నుంచి మంజూరు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. 5060 పెండింగ్ ఉండడం పై బ్యాంకుల వారి ప్రోగ్రెస్ పై వివరణ కోరారు. ఈ సమావేశంలో డిసిసి కన్వీనర్ డిజిఎం ఎ.విశ్వేశ్వరరావు, నాబార్డు ఎజిఎం వైఎస్.నాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కవిత్వం ప్రభావశీలమైంది : విసి ప్రసన్నశ్రీ

ప్రజాశక్తి - రాజానగరం

కవిత్వం ప్రభావశీలమైందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ విసి ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్శిటీలో కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్, తెలుగుశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాహిత్య విద్యార్థులకు ప్రపంచ కవితా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కవిత్వంలోని అంతరార్థం పరిస్థితులను బట్టి అర్థమవుతుందన్నారు. యతి, ప్రాసలు కావాలని దిగులు చెందకుండా భావాలకు అక్షర రూపం



కవిత్వంపై మాట్లాడుతున్న విసి

ఇవ్వాలన్నారు. క్రమంగా కవిత్వం అలవాటు అవుతుందని విద్యార్థులకు సూచించారు. కవి మనస్సుకు అనంతలోకాలను చుట్టే శక్తి ఉందన్నారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ వంటి త్రీ భాషలలో తనదైన శైలిలో కవిత్వంలోని మాధుర్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఎంతో సాహిత్య పటిమతో తనను పరిచయం చేసిన తెలుగు అధ్యాపకులు డాక్టర్ తలారి వాసుకు కవిత్వంతో అభినందనలు తెలిపారు. తరువాత సోషల్ వర్క్ పూర్వ విద్యార్థి చిన్నబాబు, ఇంగ్లీషు విభాగ విద్యార్థి వి.దయానా, ఎకనామిక్స్ విద్యార్థి జి.రాణి తమ కవిత్వాలను చదివి వినిపించారు. విద్యార్థులను వీసీ సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.జ్యోతిర్మయి, కెఎస్.రమేష్, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ ఎన్.సజనారాజ్, తెలుగుశాఖాధిపతి డాక్టర్ డి.లక్ష్మీనరసమ్మ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బౌద్ధ ధమ్మ పీఠంలో పాలిసెట్ ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మ పీఠం ఆధ్వర్యంలో పాలిసెట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు పీఠాధిపతి భంతే అనాలయో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 6న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించి, ఏడో తేదీ నుంచి శిక్షణ అందిస్తామన్నారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. 2020 నుంచి ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు 9866848509, 8500768009 నెంబర్లను సంప్రదించాలన్నారు.

హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 9 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ హెల్పర్ పోస్టులను భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ కె.నాగలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోపాలపురం మండలంలో 3 సహాయకురాలి పోస్టులు గోపాలపురం-1(బిసి-బి), రేగులగుంట-1 (ఓపెన్), పెద్దాపురం-1(ఓపెన్), దేవరపల్లి మండలం దేవరపల్లి-1(ఎస్‌సి), నల్లజర్ల మండలం నల్లజర్ల-1(ఎస్‌టి), మారేళ్ళమూడి-1(బిసి-సి) సింగరాజుపాలెం-1(ఓపెన్), తూర్పు చోడవరం-1(ఓపెన్), తూర్పు చోడవరం-1(ఓపెన్) సహాయకురాలి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తి చేసిన ధరఖాస్తులను ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఐసిడిఎస్ కార్యాలయంలో అందించాలన్నారు.

స్వీయ రక్షణలపై బాలికలకు శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దానవాయిపేట నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు స్వీయ రక్షణలో శిక్షణ ఇచ్చారు. సిఐ మంగాదేవి బాలికల స్వీయ రక్షణపై పలు విషయాలను వివరించారు. కరాటే ఇన్‌స్ట్రక్టర్ చూప్నా కరాటేలో మెళకువలు వివరించారు. అగంతులకు దాడి చేస్తే ఎలా తప్పించుకోవాలో డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బేగం, హెడ్ కానిస్టేబుల్ అలీ, మహిళా రక్షక్ సిబ్బంది హెచ్ఎం కె.వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు సునీల్ కుమార్, స్కూల్ అసిస్టెంట్ ఎల్. ప్రభాకరరావు, ఎం.లతాశ్రీ తదితరులు పాల్గొన్నారు..

పర్యావరణ సుస్థిరాభివృద్ధికి పాటుపడదాం..

ప్రజాశక్తి - రాజానగరం

అడవిని అక్షరాన్ని కలిపి నాటానని, అడవిలో అక్షర సేద్యం చేస్తూ వచ్చానని, వాటి వృద్ధిని చూశానని ఇటువంటి స్థిరమైన వృద్ధే సుస్థిరాభివృద్ధి అని విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిపార్టమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో రెండు రోజుల నేషనల్ సెమినార్‌ను శుక్రవారం నిర్వహించారు. 'పర్యావరణ పరిరక్షణ మరియు సుస్థిరాభివద్ధిపై ఎకోప్రెన్యూర్‌షిప్ ప్రభావం" అనే అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమానికి విసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి సెమినార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అటవీ నిర్మూలన. సహజ వనరుల క్షీణతపై పెరుగుతున్న ఆందోళనల కారణంగా 1960, 1970 దశకాల్లో ఆధునిక పర్యావరణ ఉద్యమం ఊపందుకుందన్నారు. పర్యావరణవాదం మొదటి తరంగం మరింత స్థిరమైన భవిష్యత్తు కోసం ఆవశ్యకతను రేకెత్తించిందని,



సెమినార్‌లో మాట్లాడుతున్న విసి ప్రసన్నశ్రీ

పర్యావరణ సమస్యలను పరిష్కరించడమే కాకుండా స్థిరమైన పద్ధతులకు దారితీసే గ్రీన్ వ్యాపారాలను సృష్టించడంపై దృష్టి సారించే ఎకోప్రెన్యూర్‌లు - వ్యవస్థాపకుల ఆవిర్భావానికి పునాది పడిందన్నారు. అభివృద్ధి పేరుతో పర్యావణానికి హాని చేకూర్చకూడదన్నారు. పర్యావరణ హితంగా జీవించాలని సూచించారు. విశ్రాంత ఆచార్యులు పి.సుబ్బారావు మాట్లాడుతూ ఎకోప్రెన్యూర్‌షిప్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ మధ్య వ్యత్యాసాలను తెలియజేశారు. ఎకోప్రెన్యూర్‌లు ముందుచూపుతో కూడిన విధానాలతో, మనం ఎదుర్కొంటున్న నిజమైన సవాళ్లను - పెరుగుతున్న కార్బన్ ఉద్గారాలు, జీవవైవిధ్య నష్టం, నీటి కొరత మరియు ప్లాస్టిక్ కాలుష్యం పరిష్కారమవుతాయన్నారు. వర్ధమాన పారిశ్రామికవేత్త సౌజన్య మాట్లాడుతూ పర్యావణహితమైన వ్యాపారాలు, పరిశ్రమలు ఉండాలని అప్పుడే భావి తరాలకు చక్కని పర్యావరణం అవుతుందన్నారు. తరువాత వర్ధమాన పారిశ్రామికవేత్తలు సౌజన్య, ఎ.బిందు, కె.లావణ్య, పి.నిరీషలను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం సెమినార్ హాల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రొడక్ట్ స్టాల్స్‌ను వీసీ సందర్శించిన నిర్వాహకులను అభినందించారు. సెమినార్‌కు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ ఆచార్య పి.ఉమమహేశ్వరిదేవి, ఆచార్య ఎన్.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



డిపిఒకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పని భారం తగ్గించాలని వినతి

ప్రజాశక్తి-కడియం

గ్రామపంచాయతీ కార్యదర్శులకు రోజురోజుకు పని భారం పెరుగుతుందని దీంతో మానసిక ఒత్తిళ్లకు గురవుతూ తీవ్ర అనారోగ్య సమస్యలు తెచ్చుకోవాల్సి వస్తుందని పంచాయతీ కార్యదర్శుల సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారిణి శాంతామణిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. మునుపెన్నడూ లేని విధంగా సర్వేలతో పాటు పదుల సంఖ్యలో పనులు అప్పగించడంతో వాటిని నిర్వహణ కష్టసాధ్యమవుతుందని వివరించారు. ఒత్తిడిని తట్టుకోలేక అనారోగ్యంతో మరణించిన సంఘటనలు కూడా ఉన్నాయని తెలిపారు. వీటిని దృష్టిలో ఉంచుకుని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సెలవు రోజుల్లో కూడా క్షణం తీరిక లేకుండా పనులు చేయడం కష్టంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజనల్ పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు టంకాల శ్రీనివాస్, మేకా ప్రసాద్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జి. వెంకట్రావు, సీనియర్ కార్యదర్శులు రూప్ చంద్, వి. శ్రీనివాసరావు,శ్రీరామమూర్తి, కొవ్వూరు డివిజన్ కు చెందిన కార్యదర్శులు షేక్ కసీమ్ సాహెబ్, మహమ్మద్ జానీ తదితరులు పాల్గొన్నారు.

23లోగా ఇస్రో సందర్శనకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఇస్రో ఆధ్వర్యంలో గల ఏడు అంతరిక్ష కేంద్రాల ఉచిత సందర్శనకు ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి జివిఎన్ఎస్.నెహ్రూ తెలిపారు. ఇస్రో యువిక -2025(యువ విజ్ఞాన కార్యక్రమం)కి దేశంలోని అన్ని యాజమాన్య పాఠశాలల 9వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మే నెలలో రెండు వారాల పాటు ట్రైనింగ్ క్లాసెస్ నిర్వహించి అంతరిక్ష పరిశోధనల పట్ల అవగాహన కల్పిస్తారన్నారు. దేశంలోని ఏడు ఇస్రో సెంటర్లను సందర్శించే అవకాశం కల్పిస్తారన్నారు. యువికాకు సెలెక్ట్ అయిన విద్యార్థులకు ప్రయాణంతో పాటు వసతి, భోజన సదుపాయాలను ఇస్రో ఉచితంగానే అందిస్తుందని తెలిపారు. యువిక షెడ్యూలు, సెలక్ట్ అయిన విద్యార్థుల లిస్టును ఏప్రిల్ 7న విడుదల చేస్తారని తెలిపారు. మే 19 నుంచి 30 వరకు యువికా-25 కార్యక్రమం జరుగుతుందన్నారు.

చెరువు పనులు వేగవంతం


ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని సూర్యారావుపాలెం గ్రామంలో ఊర చెరువు తవ్వకం పనులు వేగంగా కొనసాగుతున్నాయని సర్పంచ్ మెండే లలితకుమారి శుక్రవారం తెలిపారు. 6 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు పరిసర ప్రాంతాల్లోని నాలుగు గ్రామాలకు దాహార్తిని తీరుస్తుంది. సూర్యారావుపాలెంతో పాటు సరిహద్దు గ్రామమైన దువ్వ, పసలపూడి, రెడ్డి చెరువు గ్రామస్తులు తాగునీరు కోసం ఈ చెరువును ఉపయోగిస్తారు. 40 సంవత్సరాల అనంతరం చెరువులోని నీటిని పూర్తిగా తొలగించి, మరింత లోతు చేస్తున్నామని ఉప సర్పంచ్ నందిన శ్రీనివాస్ తెలిపారు. చెరువు తవ్వకం సుమారు పూర్తి కావస్తోందని, కాలువలు కట్టి వేసేలోగా కాలువ నీటిని చెరువులోకి నింపి, స్టోరేజ్ ఫిల్టర్ల ద్వారా నీటిని శుద్ధి చేసి పంపిణీకి సిద్ధం చేస్తామని చెప్పారు. టిడిపి నాయకులు మెండే శ్రీనివాస్ మాట్లాడుతూ సుమారు రూ.7.50 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టామన్నారు. అవసరమైతే పంచాయతీ నిధులు వెచ్చించి పూర్తి చేస్తామన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురంధేశ్వరి, ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, ఎంపిడిఒలకు నాయకులు వల్లేపల్లి రాజా, మద్దుకూరి శ్రీమన్నారాయణ,



చెరువులో సాగుతున్న తవ్వకం పనులు

గుల్లపల్లి రమేష్, ఆచంట సాయిరాం తదితరులు ధన్యవాదాలు తెలిపారు.



ఉత్సాహంగా అడ్మిషన్ క్యాంపెయిన్

పాల్గొన్న రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శుక్రవారం అడ్మిషన్ క్యాంపెయిన్‌ను నిర్వహించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపకులు బృందాలుగా విడిపోయి ఈ క్యాంపెయిన్ చేపట్టారు. పదవ తరగతి పరీక్షలు జరిగే ప్రతి సెంటర్ వద్దకూ వెళ్లి విద్యార్థులకు బ్రోచర్లు అందిస్తూ కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, గ్రూపులు, ఒకేషనల్



బ్రోచర్లను పంచుతూ అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు



విద్యార్థినికి అవగాహన కల్పిస్తూ....

గ్రూపుల గురించి వారికి వివరిస్తున్నారు. అలాగే ఏ గ్రూపులో చేరితే ఏ ప్రయోజనం ఉంటుందో చెబుతున్నారు. ఒత్తిడి లేని విద్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే సాధ్యమవుతుందని అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి.శ్రీనివాసరెడ్డి, సుధారాణి, రవికుమార్, గోపినాథ్, సునీల్ కుమార్ విద్యాసాగర్ పాల్గొన్నారు. ప్రిన్సిపల్ ఎన్ఎస్‌విఎల్.నరసింహం, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ త్రినాథ్‌రాజా అధ్యాపకులు అభినందించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా తీర్చిదిద్దడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని కామరాజుపేట ఎంపిపి పాఠశాలలో అటవీశాఖ అధికారులు ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు పి.వెంకట్రావు, కామేశ్వరరావు మాట్లాడారు. పచ్చదనం ఆరోగ్యదాయకమన్నారు. పర్యావరణ పరిరక్షణలో మనమంతా భాగస్వాములై అటవీ సంపదను కాపాడుకోవాలన్నారు. వన సంరక్షణ అంధరి బాధ్యతని విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతోనే రీసర్వే సాధ్యం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వ్యవసాయ భూమి రీ సర్వేకు రైతుల సహకారం తప్పనిసరి అని జిల్లా, అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, బి.లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని రీ సర్వేలో పైలట్ గ్రామం సత్యవాడలో తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు, సర్వే ఇన్‌స్పెక్టర్ టి.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గ్రౌండ్ ట్రూథింగ్ జరిగిన విధానం, ఎఫ్‌పిఒఎల్ఆర్, విస్తీర్ణం మధ్య వ్యత్యాసం విషయమై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం అధికారులు, రైతులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యవాడ ఎంపిటిసి ఐ.ప్రభావతి, ఉపసర్పంచ్ పి.ప్రసాద్‌రాజు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్, సిబ్బంది, విఆర్ఎలు పాల్గొన్నారు.

గంజాయికి వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

తూర్పుగోదావరి జిల్లా ఎస్‌పి డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు ధవలేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయికి వ్యతిరేకంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. గతంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసై నేర ప్రవృత్తి కలిగి ఉండి ప్రస్తుతం సత్ప్రవర్తనతో ఉన్న వారితో ఈ ర్యాలీని నిర్వహించారు. ధవలేశ్వరం పోలీస్ స్టేషన్ నుంచి సాయిబాబా గుడి వరకూ ఈ ర్యాలీ సాగింది. గంజాయికి దూరంగా ఉండాలని నినదించారు. బస్టాండ్ సెంటర్, సాయిబాబా గుడి సెంటర్‌లో మానవహారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ టి.గణేష్, ఎస్ఐ క్రాంతికుమార్, హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాస్, మూర్తి, రవికాంత్, ఆటో యూనియన్ అధ్యక్షుడు బుజ్జి, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న మండపేట సిఐ సురేష్

కుమార్తే హంతకురాలు

ప్రజాశక్తి - మండపేట

తండ్రి హత్య కేసులో కుమార్తె హంతకురాలిగా తేలింది. తన సంతోషాలకు అడ్డుగా ఉన్నాడనే కారణంగా ప్రియునితో కలిసి కన్న తండ్రిని హత్య చేసింది. మండపేట సిఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు...మండపేట మేదరపేటకు చెందిన సురా రాంబాబుకు వెంకటదుర్గ అనే కుమార్తె ఉంది. ఆమెకు వివాహమై భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త, పిల్లలతో కలిసి మండపేటలోనే నివాశముంటుంది. కొంత కాలంగా రామచంద్రపురం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ముమ్మిడివరపు సురేష్‌తో దుర్గ వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలియడంతో భర్త ఆమె నుంచి విడిపోయి అదే ప్రాంతంలో ఒంటరిగా ఉంటున్నాడు. దుర్గ తీరులో మార్పు రాకపోవడంతో తండ్రి రాంబాబు సైతం ఆమెను గట్టిగా మందలించాడు. దీంతో ఎలాగైనా తండ్రిని మట్టుబెట్టాలనుకుంది. ఈ మేరకు రాంబాబు హత్యకు ప్రియునితో కలిసి ప్రణాళిక వేసింది. మార్చి 16 రాత్రి ప్రియుడు సురేష్‌కు ఫోన్ చేసి ఇంటికి పిలిచింది. స్నేహితుడు తాటికొండ నాగార్జునను వెంటబెట్టుకుని సురేష్ మండపేటలో దుర్గ ఇంటికి వచ్చాడు. అక్కడ నుంచి వీరు ముగ్గురూ స్థానికంగా ఉంటుంటున్న రాంబాబు ఇంటికి వెళ్లారు. పడుకున్న రాంబాబు కాళ్లు చేతులు గట్టిగా పట్టుకుని గొంతు నులిమి హత్య చేశారు. రాంబాబు సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు ప్రారంభించారు. పోస్టు మార్టం రిపోర్టులో హత్యగా తేలడంతో దర్యాప్తును వేగవంతం చేశారు. అనుమానితురాలిగా ఉన్న దుర్గను ప్రశ్నించడంతో పక్కా ప్రణాళిక ప్రకారమే తండ్రిని చంపినట్లు అంగీకరించింది. నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసి రామచంద్రపురం కోర్టుకు తరలించగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని టౌన్ సిఐ సురేష్ తెలిపారు.

పొగాకు బేరన్ దగ్ధం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వాదాలకుంటలో శుక్రవారం జుజ్జవరపు రామలక్ష్మికి చెందిన పొగాకు బేరన్ దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.5లక్షల నష్టం వాటిల్లింది. క్యూరింగ్ చేస్తున్న సమయంలో పొగాకు కర్రలు ఊడిపడి ప్రధాన గొట్టంపై పడడంతో మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అదుపు కాకపోవడంతో జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. జంగారెడ్డిగూడెం నుండి అగ్రిమాపక వాహనం హుటాహుటిన తరలివచ్చి మంటలను అదుపు చేశారు. టీవల కాలంలో తరచూ అగ్ని ప్రమాదాల సంభవించి లక్షలాది రూపాయలు విలువ చేసే వర్జీనియా పొగాకు కాలిపోవడంతో రైతులకి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. గోపాలపురం నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - రాజానగరం

తన భర్త కనపడడం లేదంటూ రాజానగరం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఒక మహిళ ఫిర్యాదు చేసింది. శ్రీరామ్‌పురం గ్రామానికి చెందిన కరెడ్ల రాంబాబు (36) తాపీ పని చేసుకుంటూ కుంటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 8న ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాంబాబు తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల దగ్గర వెతికినా సమాచారం లేకపోవడంతో అతని భార్య కుసుమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్.ఐ నాగార్జున కేసు నమోదు చేశారు.

అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి జైలు

ప్రజాశక్తి - అయినవిల్లి

చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి అయిదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించారని పి.గన్నవరం సిఐ ఆర్.భీమరాజు శుక్రవారం తెలిపారు. అయినవిల్లి లంక గ్రామ శివారు గాలితిప్పపేటకు చెందిన డెక్క రాంబాబు అదే గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారిపై 2023లో అత్యాచారయత్నం చేశాడు. పాప తల్లికి జరిగిన విషయం చెప్పడంతో పోలీస్ స్టేషన్‌లో రాంబాబుపై ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసి. దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుపై శుక్రవారం కాకినాడ ఫోక్స్ కోర్టులో న్యాయమూర్తి కె.శ్రీదేవి నిందితునికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష. వెయ్యి రూపాయలు జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది జి వెంకటరత్నం వాదనలు వినిపించారు.

పాము కాటుతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి-కిర్లంపూడి

కృష్ణవరం గ్రామపంచాయతీ పరిధిలో పంట కాలువలో శుక్రవారం పూడికతీత పనిచేస్తుండగా ఉపాధి హామీ పని వేతనదారుడు నీలాద్రి అప్పారావు పాము కాటుకు గురయ్యారు. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్టు ఎపిఒ నాయుడు తెలిపారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - అయినవిల్లి

విద్యార్థులు చట్టలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్ఐ హరికోటి శాస్త్రి విద్యార్థులకు తెలిపారు శుక్రవారం ముక్తేశ్వరం కోనసీమ విద్యాశ్రమం కళాశాలలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు ఎస్ఐ ఆయన చిన్నపిల్లలు సెల్‌ఫోన్ వాడటం చట్ట రీత్యా నేరమన్నారు. స్పెషల్ బ్రాంచ్ కి పట్టుపడితే శిక్షార్హులు అవుతారని సెల్ ఫోన్ దూరంగా పెట్టి పాఠ్యాంశాలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమ ంలో 8 9 తరగతి విద్యా ర్థులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భీనాజాన్, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



షాపులు మూసివేయడంతో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

యానాంలో బంద్ ప్రశాంతం...

ప్రజాశక్తి - యానాం

డంపింగ్ యార్డ్, చెత్త సమస్యపై ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరశిస్తూ శుక్రవారం యానాంలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. డంపింగ్ యార్డ్ సమస్యతో పట్టణ, గ్రామ ప్రాంతాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిన నేపథ్యంలో అన్నా డిఎంకె పార్టీ యానాం కార్యదర్శి మంచాల సత్యసాయి కుమార్ బంద్‌కు పిలుపునిచ్చారు. దీనికి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, యానాం వర్తక సంఘం, ఎన్ఆర్.కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ తదితరులు సంపూర్ణ మద్దతు పలికారు. ఈ బంద్ పిలుపుతో యానాంలో మెడికల్ షాపులు మినహా అన్ని ఆసుపత్రులు, బ్యాంకులు, ఇతర వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. ఆయా వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేయగా పలు చోట్ల స్థానిక నాయకులు ఆయా దుకాణాలను మూయించారు. యానాం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచాల సత్యసాయి కుమార్, మాగాపు సుబ్బారావు, నల్లా వెంకన్న, కాపగంటి గోపాలకృష్ణ, చెక్కల అరుణ్ కుమార్, తోట మల్లికార్జునరావు పాల్గొన్నారు. బంద్ విజయవంతానికి కషి చేసిన, సహకరించిన నాయకులకు,వర్తక సంఘం ప్రతినిధులకు, వ్యాపారులకు, ప్రజలకు అందరికీ మంచాల సత్యసాయి కుమార్ కతజ్ఞతలు తెలిపారు.

రూ.కోటితో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - యానాం

ఆది ద్రావిడ సంక్షేమ శాఖ ద్వారా నియోజకవర్గంలో రూ.కోటితో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆ శాఖ మంత్రి సాయి శర్వనన్ తెలిపారన్నారు. ఆ పనులకు సంబంధించిన ఫైల్ గవర్నర్ దగ్గర ఉందన్నారు. గవర్నర్ ఆమోదం పూర్తయిన తర్వాత టెండర్లకు పిలిచి దరియాలతిప్ప, ఫరంపేట, మెట్టకూరు ఆది ఆంధ్ర పేట, రమాబాయి నగర్ తదితర గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, ఇతర పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

పరిశ్రమలు తెరిచేలా సహకరించాలి

ప్రజాశక్తి - యానాం

యానాంలో మూత పడ్డ వందలాది చిన్నతరహా, మధ్య తరహా, భారీ పరిశ్రమలను తిరిగి తెరిచేవిధంగా సహకరించాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ కోరారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. వేలాది మందికి ఉపాధిని కల్పించడంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా యానాం ఆర్థికాభివద్ధికి తోడ్పడ్డ రీజెన్సీ భారీ పరిశ్రమ 13 ఏళ్ళగా మూత పడిందని తెలిపారు. దాన్ని తెరిచేవిధంగా సహకరించాలని, ఆ విధంగా యాజామాన్యాన్ని సైతం ప్రోత్సహించాలని కోరారు. కొన్ని నెలల క్రితం రీజెన్సీ ఫ్యాక్టరీని తెరిచేలా సంబంధిత యాజమాన్యం చర్యలు తీసుకుంటే వివిధ కారణాలతో పాటు ప్రభుత్వం నుంచి సరియైన స్పందన లేకపోవడంతో మళ్లీ మూసివేశారన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సాలిడ్ వేస్తే మేనేజ్మెంట్ రిసోర్స్ పర్సన్ పాము వెంకటేశ్వ రరావు అన్నారు. ఆనాతవరం పంచాయతీ పరిధిలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్ వద్ద శుక్రవారం ఇఒపిఆర్‌డి కె.లక్ష్మి కల్యాణి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్ర(పారిశుధ్య సిబ్బందికి) ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చి దిద్దేందుకు చెత్తను రోడ్డు పక్కన, మురుగు డ్రెయినేజీల్లో వేయవద్దన్నారు. ఇంట్లో వాడిన తడి, పొడి, ఘన వ్యర్థా లైన చెత్తన పంచాయతీ పరిధిలో పని చేసే క్లాప్ మిత్రాలు చెత్తను సేకరించే వాహనాల్లో ఇంటింటికి వెళ్లి తడి, పొడి, హానికర చెత్తలను సేకరిస్తారన్నారు. వాటిని సాలిడ్ వేస్తే మేనేజ్మెంట్ కేంద్రాలకు తరలించి తడి, పొడి, హానికర చెత్తను వేరు వేరు చేయడం ద్వారా ప్రాసిసింగ్ చేయడం సులభతరం అవుతుందన్నారు. తడి చెత్త నుండి ఎరువులు, వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేయవచ్చునని, పొడి చెత్తను రీ సైక్లింగ్ చేయడం ద్వారా వాతావరణాన్ని కాపాడవచ్చునన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిమ్మితి చిరంజీవి, ఉప్పలగుప్తం ఇఒపిఆర్‌డి రాజ్ కుమార్, పంచాయతీ కార్య దర్శి సిహెచ్‌వి కె.సురేష్ క్లాప్ మిత్రాలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన

ప్రజాశక్తి - అల్లవరం

కొమరగిరిపట్నంలో ట్రైనింగ్ సెంటర్ ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ వద్ద అల్లవరం, అమలాపురం, మామిడికుదురు, మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రా లకు చెత్త నుంచి సంపద తయారీ పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్రమంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరు, తడి చెత్త పొడి చెత్త వేరు చేయుట, నాడెపు తొ ట్టెలలో సెమీ కంపోస్ట్ తయారి విధానం, వెర్మీ తొట్టె లలో వెర్మీ కంపోస్ట్ తయారీ విధానం పై అల్లవరం విస్తరణ అధికారి యూ నాగేంద్ర , ఫ్ టి సి మధు మహేష్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్రమంలో గ్రామ సర్పచ్ రాకాపు విజయలక్ష్మి, మామిడికుదురు, అమలాపురం మండలాల విస్తరణ అధికారులు పాల్గొనియున్నారు.

నగరవనంలో అంతర్జాతీయ అటవీ దినోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు నగర వనంలో శుక్రవారం అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహించారు.కళాశాల లెక్చరర్లు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ ఆర్.వెంకటేష్ బి.బుజ్జి బాబు అటవీ అధికారులతో కలిసి చెట్ల పెంపకం, ప్రకృతి నడకలు, అటవీ సంరక్షణపై ఇంటరాక్టివ్ సెషన్‌లతో సహా అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ముఖ్య అటవీ సంరక్షణాధికారి బిఎన్ఎన్.మూర్తి, ఐఎఫ్ఎస్, సుస్థిర అటవీ నిర్వహణ అవసరాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించడంలో యువత పాత్రను వివరించారు. రాజమండ్రి జిల్లా అటవీ అధికారి రవీంద్రధామ, ఐఎఫ్ఎస్, విద్యార్థులు జీవఅధోకరణం చెందని ప్లాస్టిక్ పదార్థాల వాడకానికి వ్యతిరేకంగా ప్రచారం చేయాలని కోరారు. అటవీ డిప్యూటీ కన్జర్వేటర్ ఆర్.శ్రీనివాస్, ఎసిఎఫ్ ఎంవి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - రాజానగరం

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాజమహేంద్రవరం నార్త్ జోన్ డిఎస్‌పి వై.శ్రీకాంత్ అన్నారు. రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధి కొంతమూరులో గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డిఎస్‌పి శ్రీకాంత్, సిఐ ఎస్.ప్రసన్నవీరయ్యగౌడ్, ఎస్ఐ పి.మనోహర్ పాల్గొన్నారు. అనంతరం మెయిన్ రోడ్డు మీదుగా ఎయిర్‌పోర్టు రోడ్డు అవుట్ పోలీస్ స్టేషన్, శానిటోరియం సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. డిఎస్‌పి మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలు ఉపయోగించినా, రవాణా చేసినా, కలిగి ఉన్నా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. యువత చెడు అలవాట్లుకు బానిసలు కారాదన్నారు. పోలీస్ సిబ్బంది, యువకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఒఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లపూడి

పెరుగుతున్న ఎండలు, ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని ఇన్‌ఛార్జి తహశీల్దార్ భారతి తెలిపారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయనే వాతావరణ శాఖ సూచనల మేరకు గ్రామాల్లో ముఖ్య కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రక్కిలంక అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం పిహెచ్‌సి వైద్యాధికారి హారికాగుప్త, సూపర్‌వైజర్ భాగ్యకుమారి ఇతర సిబ్బంది విద్యార్థులకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు.

నేడు తాళ్లపూడి మండల సమావేశం

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు ఎంపిడిఒ కార్యాలయంలో జరుగుతుందని ఎంపిడిఒ రమణ తెలిపారు. ఎంపిపి జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన జరిగే ఈ సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాగల్లు

ఆదరణ-3 పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, ఎంపిపి మట్టా వీరాస్వామి ప్రజలకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపిడిఒ అధ్యక్షతన ఆదరణ-3పథకంపై సమావేశం జరిగింది. ప్రణాళికల రూపకల్పన, వృత్తిదారులకు అవసరమైన సామగ్రి వివరాలు, పంపిణీ దారుల సమాచారం తదితరాలపై చర్చించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఆళ్ల హరిబాబు, నాదేళ్ల శ్రీరామ్‌చౌదరి, వృత్తి సంఘాల నాకులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ డౌన్ సిండ్రోమ్ డే

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం చాగల్లు భవిత కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ డౌన్ సిండ్రోమ్ డేను ఘనంగా నిర్వహించారు. ఒక ఎక్స్‌ట్రా క్రోమోజోమ్ యాడ్ అవ్వడం వల్ల వైకల్యం వస్తుంది. కాని ఈ దివ్యాంగ చిన్నారులను కూడ తర్ఫీదు ఇచ్చి మెరుగు పర్చొచ్చని భవిత టీచర్ ఎం.శిరీష తెలిపారు. భవిత కేంద్రంలో అందే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ సిహెచ్.సుభాకర్ కోరారు. ఈ కార్యక్రమంలో భవిత విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది ఎం.శిరీష, సిహెచ్.నాగపూర్ణిమ, హెచ్‌ఎం రామలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేయించి మిఠాయిలు పంచారు.



చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని ప్రతి గ్రామంలోనూ తప్పనిసరిగా చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ సూచించారు. శుక్రవారం మండలంలోని పాలంగి ప్రధాన రహదారిపై గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని, ప్రభుత్వ ఉన్నతాధికారుల ఉత్తర్వులు మేరకు ప్రతి గ్రామ పంచాయతీ లోనూ, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీల ద్వారా లేదా దాతలు, ఇతర సంస్థల సహకారంతో వీటిని ఏర్పాటు చయాలన్నారు. అనంతరం ప్రధాన రహదారిపై ప్రయాణికులకు, స్థానికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపిడిఒ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-శంఖవరం

మండల కేంద్రమైన శంఖవరం కస్తూరిబా బాలికల పాఠశాల కళాశాలలో 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ బాలామణి తెలిపారు. బడి బయట పిల్లలు, మధ్యలో బడి మానేసిన వారు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ వర్గాల చెందిన బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తామని,కళాశాల నోటీస్ బోర్డులో లిస్టు ప్రకటిస్తామని ఆమె తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9618146624, 7288096339 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపల్ బాలమణి కోరారు.

పశువుల గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తిలో పశువుల ఎండు గడ్డి వామి దగ్ధమయ్యింది. ఇబిసి కాలనీలో నివాసముంటున్న పిర్ల సత్తిబాబు పశువుల మేత నిమిత్తం ఇటీవల రెండెకరాల గడ్డివామి వేసుకున్నారు. శుక్రవారం ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధం కావడంతో వెంటనే పిఠాపురం నుండి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేయడానికి తీవ్రంగా కృషి చేశారు.



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు

చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

అంగన్‌వాడీ చిన్నారులకు పోషకాహార లోపం రాకుండా ప్రతి కార్యకర్తా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విస్తరణాధికారులు నళిని, రమణి కుమారి, నిభావని, లలిత నిర్మల అన్నారు. నీలపల్లి, చొల్లంగి హైస్కూల్లో జరిగిన పోషన్, పడాయి రెండో రోజు శిక్షణలో అంగన్వాడీలకు పలు విషయాలు బోధించారు. చిన్నారులకు పోషక సూక్ష్మ పోషక లోపాలు ఉండటంవల్ల ఎదుగుదల తగ్గుతుందని అన్నారు. తల్లి పాలు ప్రాముఖ్యతను తెలియజేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు విషయాలను వివరించారు.

నేడు 'ఆదరణ' సమావేశం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఆదరణ-3 పథకానికి సంబంధించి, ప్రణాళికలు రూపొందించేందుకు నిర్వహించనున్న సమావేశానికి వృత్తిదారులు హాజరు కావాలని ఎంపిడిఒ వివిఎస్.రామారావు కోరారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ సమావేశంలో చేతివృత్తి దారులకు నాణ్యతాపరంగా ఆధునిక పనిముట్లు, మంచి కంపెనీలు, ఏజన్సీల ద్వారా అందించేందుకు, వారికి కావాల్సిన పనిముట్ల వివరాల సేకరణకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

పోలీసు స్టేషన్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి-రౌతులపూడి

పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులకు అనువైన స్థల కోసం ప్రత్తిపాడు సిఐ సూరి అప్పారావు, ఎస్ఐ వెంకటేశ్వరరావు మండల కేంద్రంలో శుక్రవారం పరిశీలించారు. త్వరలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులకు చేపట్టేందుకు చర్యలు తీసుకునేందుకు స్థల సేకరణ చేపడుతున్నామని పోలీస్ అధికారులు తెలిపారు. ఈ పర్యటనలో ఆర్ఐ పట్నాయక్ తదితరులు ఉన్నారు.

జాబ్ మేళాలో 52 మందికి ఉపాధి

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 52 మంది ఉపాధి అవకాశాలు పొందారు. ఎపి రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మినీ జాబ్ మేళాలో 4 కంపెనీలు ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 147మంది నిరుద్యోగులు హాజరవగా వీరిలో 52 మంది ఆయా కంపెనీలో ఉపాధి అవకాశాలు పొందారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ మురళి, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ ప్రేమ్ కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్ కిషోర్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రేవతి పాల్గొన్నారు.

ఈ నెల 24న పి-4 సర్వేపై గ్రామసభలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో నిర్వహించిన పి-4 సర్వేపై ఈ నెల 24న అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని ఎంపిడిఒ డి.శ్రీ లలిత అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ గ్రామసభల్లో పి-4 సర్వే ద్వారా గుర్తించిన లబ్ధిదారుల వివరాలు తెలియజేస్తారన్నారు. రోజురోజుకు ఎండ తీవ్రత ఎక్కువ అవుతున్నందున ప్రతి గ్రామంలో ప్రజలకు వేసవి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి రమణ, మండల కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సిఎం రిలీఫ్ ఫండ్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సిఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని కో ఆర్డినేటర్ మాజీ ఎంఎల్ఎ పిల్లి సత్యనారాయణ మూర్తి అనంత లక్ష్మి దంపతులు అన్నారు. పలువురు లబ్ధిదారులకు శుక్రవారం వారు చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు.

23న ఎడ్ల పరుగు పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోటలో ఈ నెల 23న శ్రీకుమార రామ భీమేశ్వర రాష్ట్రస్థాయి ఎడ్ల పొరుగు పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వహణ కమిటీ నాయకులు బిక్కిన రంగ, వల్లూరి దొరబాబు తెలిపారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ సామర్లకోట మండలం ఉండూరు రైల్వే గేటు వద్ద ఎన్‌ఎఫ్‌సిఎల్ రహదారిలో వల్లూరి సత్యేంద్ర కుమార్ మెమోరియల్ రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కూడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పాల్గొని ఈ పోటీలను ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

సిఎం రిలీఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

సిఎం రిలీఫ్ ఫండ్ పథకం ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతో మేలు చేస్తుందని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. అచ్చంపేటలోని ఎంఎల్ఎ కార్యాలయంలో టిడిపి నాయకులు నిమ్మకాయల కిరణ్ కుమార్, ముత్యం రాజుబాబుల ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు ఎంఎల్ఎ చినరాజప్ప సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. సహాయం అందుకున్న లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

మూడు రోజులపాటు పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి -సామర్లకోట

సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, రావికంపాడు స్టేషన్ల మధ్య సిగ్నలింగ్ పనుల కారణంగా ఈ నెల 23, 24, 25 తేదీల్లో పలు రైళ్లను రద్దు రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్టు స్టేషన్ మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఉదయ్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు, గుంటూరు నుంచి విశాఖ వెళ్లే సింహాద్రి ఎక్స్‌ప్రెస్, కాకినాడ-విశాఖపట్టణం, రాజమండ్రి- విశాఖపట్టణం మధ్య నడిచే మరో నాలుగు రైళ్ల ఈనెల 24, 25 తేదీల్లో రెండువైపులా రద్దు అయినట్టు తెలిపారు.

హిందూ ముస్లిములు సమైక్యతకు కట్టుబడి ఉండాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

లౌకికవాద భారతదేశంలో హిందూ ముస్లిములు సమైక్యతతో మెలగాలని వైసిపి ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏలేశ్వరం జామియా మసీదులో శుక్రవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా భారతదేశం సర్వ మత సమైక్యతకు చిహ్నం అని కొనియాడారు. షేక్ దిల్బర్ హుస్సేన్, అక్బర్ అలీ ఖాన్, సయ్యద్ అమీర్, వైకాపా నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవిందు, సుంకర రాంబాబు, సామంతుల సూర్య కుమార్ జువ్వెన వీరాజు, గోళ్ళ నాగేశ్వరరావు ఉన్నారు.